సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 22.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 261
పేజీలు: 06 వెల: రూ. 5

### జర్నలిస్టులకు ఉద్యమకారుల
## గుర్తింపు ఇవ్వాలి

టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

- ఉద్యమంలో జర్నలిస్టుల సేవలకు గౌరవం కల్పించాలి
- జర్నలిస్టుల త్యాగాలను గుర్తించాలని టీయుడబ్ల్యూజే
- ఉద్యమ జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి

03





### ఢిల్లీలో తీవ్ర
## ఉద్రిక్తత

### ప్రధాని ఇంటి వద్ద కాంగ్రెస్ ధర్నా..
### రాహుల్, ప్రియాంక అరెస్టు

- మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- లోక్ కల్యాణ్ మార్గ్‌లో కాంగ్రెస్ ఆందోళన.. అదుపులోకి నేతలు
- విద్యార్థుల ఘటనపై కాంగ్రెస్ నిరసన..

**ముద్ర , న్యూ ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా తదితర కాంగ్రెస్ నేతలు లోక్ కల్యాణ్ మార్గ్ వద్ద నిరసన చేపట్టారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. చేతులు కట్టేసుకుని వారు నిరసన తెలిపారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అక్కడి నుంచి వెళ్లిపోవాలని కాంగ్రెస్ నేతలను పోలీసులు కోరుతున్నారు. సీజేపీ ర్యాలీ వేళ భద్రతా బలగాలు విద్యార్థులపై ప్రవర్తించిన తీరును ఖండిస్తూ కాంగ్రెస్ ఈ నిరసన చేపట్టింది.

లోక్ కల్యాణ్ మార్గ్ వద్ద నిరసన చేపట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎంపీ సురేశ్ మాట్లాడుతూ.. "మమ్మల్ని అత్యంత దారుణంగా మిగతా 02లో

## బండి.. ఈటెల..
# రాజీ

- తెలంగాణ బీజేపీలో ఐక్యతకు అధిష్ఠానం కసరత్తు
- అభయ్ పాటిల్ సమక్షంలో చేతులు కలిపిన నేతలు
- పార్టీ లైన్‌లో నడవాలని నేతలకు స్పష్టమైన సూచన
- బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కీలక సమన్వయం
- కరీంనగర్ రాజకీయాలకు కొత్త మలుపు
- గతం మరిచి భవిష్యత్తుపై ఫోకస్ పెట్టిన బీజేపీ
- వర్గపోరుకు బ్రేక్.. కలిసికట్టుగా ముందుకు నేతలు
- బండి-ఈటెల ఐక్యతతో తెలంగాణ బీజేపీకి కొత్త ఊపు?

### విభేదాలకు ఫుల్‌స్టాప్.. షేక్‌హ్యాండ్‌తో
## కొత్త సంకేతం




**ముద్ర డెస్క్:** గతం ఎపుడూ గతమే. కానీ అది వర్తమానంలో కూడా కొనసాగుతుంది. అనుభవాలుగా జ్ఞాపకాలుగా దాని ప్రభా వం ఉంటుంది. మౌన మునులు అయితే గతం గతహా అని అనేసుకోగలరు, కానీ రా జకీయ జీవులు అలా అంత ఈజీగా మరచిపోగలరా అంటే తాత్కాలికంగా అయినా చేతులు కలిపినా రాజకీయ మేలు చాలానే ఉంటుంది అన్నది చరిత్ర నిరూపించింది. 2023లో తెలంగాణాలో అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ నేతలు అంతా తమ మధ్య విభేదాలు మరచి అంతా ఒక్కటి అయ్యారు. ఫలితంగా పార్టీకి అధికారం దక్కింది. ఇపుడు బీజేపీ కూడా అదే విధంగా తెలంగాణాలో రిపేర్లకు రంగం సిద్ధం చేస్తోంది. ఎక్కడ లోపం ఉంది, మరెక్కడ శాపం ఉంది అన్నది తవ్వి తీసి మరీ సరిదిద్దుకునే చర్యలకు ఉపక్రమిస్తోంది.

**బండి వర్సెస్ ఈటెల**

ఈ ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. అంతే కాదు ఇద్దరూ రాజకీయంగా సీనియర్ నేతలే. ఈటెల మంత్రిగా ఉద్యమ నేతగా ఉంటే బండి బీజేపీలో అంచెలంచెలుగా ఎదిగి వచ్చారు. అంతే కాదు ఆయన కేంద్ర మంత్రిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేసిన అనుభవం ఉంది. ఇక ఈ ఇద్దరి రాజకీయ కార్యక్షేత్రం కూడా ఉమ్మడి కరీం నగర్ జిల్లా. దాంతో ఈటెల బీజేపీలో చేరిన తరువాత రెండు వర్గాలుగా జిల్లా బీజేపీ రాజకీయం మారింది. ఈటెల వర్సెస్ బండి అన్నట్లుగా రాజకీయం స్టార్ట్ అయింది. ఈటెల వర్గం బలంగా కరీం నగర్ జిల్లాలో ఉంది. ఆయన సొంత నియోజకవర్గం హుజూరాబాద్ కూడా అక్కడే ఉంది. దాంతో ఈటెల బీజేపీలో బలపడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు బండి వర్గం గడి కొడుతోంది అన్న ఆరోపణలు వచ్చాయి. ఇక ఈటెల బండి పరోక్షంగా ఒకరి మీద మరొకరు విమర్శలు చేసుకుంటూ వచ్చిన సంగతిని కూడా గుర్తు చేస్తున్నారు. మిగతా 03లో

## జనంలోకి హరీష్
### సిద్దిపేట పాదయాత్రకు స్పందన..



- బీఆర్ఎస్‌లో కొత్త చర్చలకు తెర
- రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సంకేతాలా?

02

## అప్పుల భారత్
### 11 ఏళ్లలో 214% పెరుగుదల




- ₹201.17 లక్షల కోట్లకు చేరిన కేంద్ర రుణభారం
- పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించిన తాజా లెక్కలు
- పదేళ్లలో ₹125.99 లక్షల కోట్లు కొత్త అప్పులు

04

## పాక్‌కు వార్నింగ్
### ఉగ్రవాదం ఆపితేనే వాటర్

- కెనడాలోనూ పాక్‌కు ఎదురుదెబ్బ
- కశ్మీర్, జలాల వివాదంపై స్పందించని ఒట్టావా

04





### రాజకీయ
# ప్రకంపం!
### డీలిమిటేషన్‌తో తెలుగు రాష్ట్రాల్లో కలవరం

- పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ సీట్లూ పెరగనున్నాయా?..
- ఏపీకి 225, తెలంగాణకు 153 సీట్ల దిశగా అడుగులు
- బిల్లు వస్తే అసెంబ్లీ స్థానాల పెంపునకు రాజ్యాంగ అడ్డంకులు తొలగే అవకాశం
- ఆర్టికల్ 81, 82తో పాటు 170లోనూ సవరణలు తప్పనిసరి
- ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్-26 అమలుకు మార్గం సుగమం
- కొత్త నియోజకవర్గాలతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి





**ముద్ర న్యూఢిల్లీ:** దేశ రాజకీయాలను పూర్తిగా మార్చే సామర్థ్యం ఉన్న డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ దేశవ్యాప్తంగా జోరందుకుంది. ఇప్పటివరకు ఈ ప్రక్రియను చాలామంది కేవలం లోక్‌సభ స్థానాల పెంపుతోనే ముడిపెట్టి చూస్తున్నప్పటికీ, వాస్తవానికి డీలిమిటేషన్ ప్రభావం రాష్ట్ర శాసనసభలపైనా సమానంగా పడనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల సంఖ్య కూడా పెరగడం దాదాపు ఖాయమనే అభిప్రాయం రాజ్యాంగ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇది భారీ రాజకీయ మార్పులకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగతా 03లో



### కోడి చెరువును
## కబ్జా చేయలేదు
### పవన్ కళ్యాణ్‌పై అసత్య ఆరోపణలు

- కోడి చెరువుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్
- మట్టి నింపింది పవన్ కాదు
- చెరువు స్వరూపం మారలేదన్న హైడ్రా

03

### విద్యార్థుల అరెస్టులపై
## నిరసన..
### కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

02



- విద్యార్థుల, యువత రక్తం చూడటమేనా దేశభక్తి?
- విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను ఆపాలి
- బీజేపీ బ్రిటీష్ పాలనను తలపిస్తోంది
- విద్యార్థులు, యువతపై నిర్బంధ చర్యలు ఖండనీయం
- ఢిల్లీ నిరసనలకు మద్దతుగా తెలంగాణలో 'ఛలో లోక్‌భవన్'

### వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం
## గ్రీన్ సిగ్నల్..

- రూ.496.86 కోట్లతో అభివృద్ధికి ఏఏఐ ఆమోదం
- రన్‌వే, ట్యాక్సీవే, అప్రాన్, బౌండరీ వాల్ నిర్మాణానికి టెండర్లు విడుదల
- భూసేకరణ, చట్టబద్ధ అనుమతుల తర్వాత వేగం పుంజుకోనున్న పనులు
- కొత్తగూడెంలో విమానాశ్రయానికి అవకాశం లేదని ఏఏఐ స్పష్టం
- రాజ్యసభలో కేంద్రమంత్రి వెల్లడి

03



### ఎల్ నినో సవాళ్లపై సర్కార్
## పక్కా ప్లాన్
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావం పడకుండా చర్యలు
- రైతాంగానికి మేలు చేసేలా ప్రత్యామ్నాయ పంటలు.. స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
- పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగంతో ఆర్థిక భారం తగ్గుతుంది
- రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ సదస్సు.. హాజరైన మంత్రి అజారుద్దీన్

02



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 22.07.2026
www.mudranews.in | @mudranews



## దోమల బెడద నివారణ చిట్కాలు



ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనివ్వకండి : దోమలు ఎక్కువగా నిల్వ నీటిలోనే గుడ్లు పెడతాయి. కాబట్టి కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, బకెట్లు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా తరచూ శుభ్రం చేయండి. వారానికి కనీసం ఒకసారి నీటిని పూర్తిగా మార్చడం మంచిది.

### విద్యార్థుల అరెస్టులపై

# నిరసన



**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్ భవన్'లో విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ, ఏఐఎఫ్ డీఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. న్యూఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఖైరతాబాద్ నుంచి లోక్ భవన్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకుని ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గాయపడినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలపై దమనకాండ కొనసాగుతోందని విమర్శించారు. విద్యారంగంలో నెలకొన్న సంక్షోభాలు, పరీక్షల నిర్వహణలో అవ్యవస్థ, పేపర్ లీక్‌లకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ పరిణామాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని కోరారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దని విద్యార్థి సంఘాలు ప్రభుత్వాలను హెచ్చరించాయి. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, పారదర్శక పరీక్షా వ్యవస్థ కోసం జరుగుతున్న ఉద్యమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ రెడ్డి, ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, హైదరాబాద్ జిల్లా నాయకులు ప్రవీణ్, అర్జున్, భరత్, నరేందర్, నర్సింహారెడ్డి, లిఖిత్, చరణ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వంశవర్ధన్ రెడ్డి , ఎండీ అన్వర్ , హరీష్ , అరుణ్, కృష్ణ , అనిల్, జోసఫ్, హరి, పీడీఎస్‌యూ నాయకులు సాయి. ప్రసాద్, అంజి, వినోద్, దినకరన్, కార్తీక్, లోకేష్ ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర నాయకుడు తెకుంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ అభివృద్ధిపై సీఎం సమీక్ష



**ముద్ర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న సీఎం, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఏ తండా లోనూ రోడ్డు సౌకర్యం లేకుండా ఉండకూడదని స్పష్టం చేసిన సీఎం, ప్రతి గ్రామం నుంచి సంబంధిత మండల కేంద్రానికి బీటీ (బ్లాక్ టాప్) రోడ్డు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రజల రవాణా, విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు మెరు గైన రహదారి అనుసంధానం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

ఇటీవల ఏర్పాటైన కొత్త గ్రామ పంచాయతీలకు అవసరమైన గ్రామపంచాయతీ భవనా ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అభివృద్ధి పనుల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) స్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. పనుల నాణ్యత, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

అదేవిధంగా, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. కొ డంగల్ నియోజకవర్గంలో ఎక్కడా తాగునీ టి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మౌలిక వసతులు, సురక్షిత తాగు నీటి సరఫరా అం దించడం లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.



# జనంలోకి హరీష్?

**ముద్ర డెస్క్:** తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్‌షూటర్‌గా, క్షేత్రస్థాయి మాస్ లీడర్‌గా గుర్తింపు పొందిన మాజీ మంత్రి టి. హరీష్‌రావు మరోసారి తన రాజకీయ శైలిని చాటిచెప్పారు. సిద్దిపేట జిల్లాలో కాళేశ్వరం జలాలను రంగనాయక సాగర్‌కు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సుమారు 15 కిలోమీటర్ల పాదయాత్రకు రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమం సాధారణ నిరసన కంటే ప్రజా ఉద్యమాన్ని తలపించేలా సాగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఒక మండల స్థాయిలోనే ఇంతటి స్పందన లభిస్తే, ఇదే తరహా పాదయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తే రాజకీయ ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై అన్ని పార్టీల్లోనూ చర్చ మొదలైంది. సోషల్ మీడియా ప్రచారాల కంటే ప్రజల మధ్య ప్రత్యక్షంగా ఉండే నాయకత్వమే అసలైన బలమని హరీష్‌రావు మరోసారి నిరూపించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రతిపక్షంలోనూ క్షేత్రస్థాయి పోరాటం**

బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత పలువురు నేతలు పరిమిత రాజకీయ కార్యకలాపాలకే పరిమితమవుతున్న వేళ, హరీష్‌రావు మాత్రం రైతు సమస్యలు, సాగునీటి అంశాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రధాన ఎజెండాగా తీసుకుని నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లోనూ ఆయన చురుకుదనంపై చర్చ కొనసాగుతోంది.

**ప్రతి అడుగుపై రాజకీయ విశ్లేషణ**

హరీష్‌రావు రాజకీయ ప్రయాణంలో ప్రతి అడుగు చర్చనీయాంశంగానే మారుతోంది. ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తే వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తుంటే, కొంతకాలం నిశ్శబ్దంగా ఉంటే పార్టీపై అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం మొదలవుతోంది. అయితే ఈ రెండు ప్రచారాలను పట్టించుకోకుండా తన రాజకీయ శైలిలో ముందుకెళ్తున్న తీరు ఆయన ప్రత్యేకతగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**పార్టీ భవిష్యత్ వ్యూహాల్లో కీలకమా?**

బీఆర్ఎస్‌లో బలమైన కేడర్, విస్తృత ప్రజాదరణ కలిగిన నేతల్లో హరీష్‌రావు ఒకరు. అందుకే ఆయన ప్రతి రాజకీయ చర్య పార్టీ అంతర్గత చర్చలకు దారి తీస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి, సాగునీటి సమస్యలను ప్రధాన రాజకీయ అంశాలుగా మలచడంలో ఆయన చురుకుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సిద్దిపేట పాదయాత్రతో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాకుండా సొంత పార్టీలోనూ స్పష్టమైన రాజకీయ సంకేతాలు పంపారనే విశ్లేషణ వినిపిస్తోంది. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని మరోసారి క్షేత్రస్థాయిలో నిరూపించారని అనుచరులు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రవ్యాప్త యాత్రకు ఆసక్తి**

రాబోయే రోజుల్లో ఇలాంటి పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తారా? పార్టీ అధిష్ఠానం హరీష్‌రావుకు మరింత కీలక బాధ్యతలు అప్పగిస్తుందా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. రైతు సమస్యలనే ప్రధాన అజెండాగా చేసుకుని హరీష్‌రావు చేపడుతున్న క్షేత్రస్థాయి పోరాటం బీఆర్ఎస్‌కు కొత్త ఊపు తీసుకువస్తుందా లేదా అనేది చూడాలి.

### ఎల్నినో సవాళ్లపై తెలంగాణ

# సర్కార్ పక్కా ప్లాన్



ఎల్నినో ప్రభావం వల్ల వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రతికూల ప్రభావం పడకుండా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పాల్గొన్న ఆయన, ప్రజల్లో గ్రామస్థాయి వరకు అవగాహన పెంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచి, థర్మల్ విద్యుత్‌ను సమర్థంగా నిర్వహించడం ద్వారా ఆర్థిక భారం తగ్గిస్తూ విద్యుత్ గ్రిడ్‌ను స్థిరంగా ఉంచుతున్నామని వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో జిల్లాల వారీగా కూడా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎనర్జి స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ పాటిల్ ప్లానింగ్ డైరెక్టర్ రూఫొస్ దత్తం పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

**ముద్ర, హైదరాబాద్:** వికారాబాద్ జిల్లా హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతిని తనిఖీ చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి గారు ఎడ్యుకేషన్ హబ్‌కు సంబంధించి ఆయా విద్యా సంస్థల భవన నిర్మాణాలను, ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ కాలేజీలు, ఫిజియో థెరఫీ – పారా మెడికల్ కాలేజీలు, సంబంధిత హాస్టళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతీ నెలా పనుల పురోగతిపై తనిఖీ చేయడమే కాకుండా ఒక రోజు సైట్‌లోనే బస చేస్తానని చెప్పారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి వారిని సస్పెండ్ చేయడానికి వెనుకాడొద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.



# దేవాదులపై నిర్లక్ష్యం..

## మాజీ మంత్రి హరీశ్ రావు

**ముద్ర, హైదరాబాద్:** దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ దేవాదుల పంపులను పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శించారు. 22 రిజర్వాయర్లు నింపి 3.17 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రులు చెప్పి రైతులను నమ్మించారని, ఇప్పుడు నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.




ఇది ప్రకృతి సృష్టించిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వచ్చిన కరువని ఆరోపించారు. వెంటనే దేవాదుల 10 మోటార్లను పూర్తిస్థాయిలో నడిపి రిజర్వాయర్లు నింపాలని, రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రాజయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రెస్ మీట్ లో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రాజయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

అదుపులోకి తీసుకుంటున్నారు. నిన్న ఢిల్లీ పోలీసులు మా విద్యార్థులపై దారుణంగా వ్యవహరించినందుకు నిరసన తెలిపేందుకు ప్రధాని నివాసం ముందు ఆందోళన చేస్తున్నాం. ప్రధానమం త్రి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. కేంద్ర హోంమంత్రి కూడా ఎలాంటి ప్రకట న చేయడం లేదు. ప్రధానమంత్రి నోరు కూడా విప్పడం లేదు" అని అన్నారు. అదుపులోకి తీసుకున్న తర్వాత పంజాబ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్ చరణ్‌జిత్ సింగ్ చన్నీ మాట్లాడుతూ.. "ఇది బీజేపీ ఉగ్ర వాదం. వారు విద్యార్థుల మాట వినడం లేదు..." అని ఆరోపించారు.





# రాహుల్ అరెస్టుపై ఖండన

### యువతపై అక్రమ కేసులు బనాయించి బెదిరించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు

**ముద్ర, హైదరాబాద్:** పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో ధర్నా చేసిన లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని బలవంతంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. 'చలో పార్లమెంట్' సందర్భంగా సోమవారం వేలాది మంది విద్యార్థులు, యువతపై బాష్పవాయువు ప్రయోగించి పోలీసుల పాశవికంగా లాఠీఛార్జ్ చేయడం, దీనిపై తక్షణం పార్లమెంటులో చర్చించాలనే ప్రతిపక్షాల డిమాండ్ పట్టించుకోకుండా మొండిగా, నాన్చుడు ధోరణితో వ్యవహరించడం అప్రజాస్వామికమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ప్రధాని నివాసం వద్ద నేడు ధర్నా చేస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సహా పలువురు ఎంపిలను అరెస్టు చేయడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు.

**యువతతో పెట్టుకున్న బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి**

పేపర్ లీకులు, కేంద్ర జవాబుదారీ రాహిత్యాన్ని నిరసిస్తూ, నిర్బంధాలను, బెదిరింపులను ఖాతరు చేయకుండా , దేశ నలుమూలల నుండి పదుల వేల సంఖ్యలో విద్యార్థులు, యువత ఢిల్లీలో చలో పార్లమెంట్ భారత దేశ చరిత్రలో అపూర్వ ఘట్టం అని కూనంనేని అన్నారు. దీనికి హాజరైన యువతపై అక్రమ కేసులు బనాయించి బెదిరించడం ఏ మాత్రం సమర్థనీయం కాదని అన్నారు. తక్షణమే వారిపై కేసులు ఉపసంహరించుకోవాలని, అలాగే యువతపై పాశవికంగా లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న యువతతో పెట్టుకున్న బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని కూనంనేని హెచ్చరించారు. సోనం వాంగ్ చుక్ తో చర్చించి సమస్యను పరిష్కరించి ఆయన విలువైన ప్రాణాలను కాపాడాలని సాంబశివరావు అన్నారు. అలాగే హైదరాబాద్ 'లోక్ భవన్ వద్ద నిరసనకు దిగిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు.

## ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోండి



కిటికీలు, తలుపులకు మెష్ (దోమ తెర) అమర్చండి. సాయంత్రం సమయంలో తలుపులు ఎక్కువ సేపు తెరిచి ఉంచకండి. నిద్రించే సమయంలో దోమతెరను ఉపయోగించడం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

# రాజకీయ భూకంపం!



**(మొదటి పేజీ తరువాయి)**
భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81, 82లు లోక్‌సభ స్థానాల పునర్విభజనకు సంబంధించినవి కాగా, రాష్ట్ర శాసనసభల స్థానాల పునర్విభజనకు ఆర్టికల్ 170 వర్తిస్తుంది. కాబట్టి కేంద్రం డీలిమిటేషన్ అమలు చేయాలంటే కేవలం ఎంపీ స్థానాలకే పరిమితం కాకుండా అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనల్లోనూ మార్పులు చేయాల్సి ఉంటుంది. అంటే పార్లమెంట్ స్థానాల పెంపుతో పాటు రాష్ట్ర అసెంబ్లీల స్థానాల పెంపు కూడా అదే ప్రక్రియలో భాగమవుతుంది.

### తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 లోని సెక్షన్–26 ప్రకారం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాలని ఇప్పటికే చట్టంలో పేర్కొన్నారు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం అమల్లో ఉన్న ఫ్రీజ్ కారణంగా ఈ నిబంధన అమలు కాలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ సందర్భంగా ఆ ఫ్రీజ్ తొలగితే, విభజన చట్టంలో పేర్కొన్న సీట్ల పెంపు అమలుకు మార్గం సుగమమయ్యే అవకాశం ఉంది.

### లోక్‌సభ, అసెంబ్లీల్లోనూ పెరుగుదల

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు 25 లోక్‌సభ స్థానాలు, తెలంగాణకు 17 స్థానాలు ఉన్నాయి. డీలిమిటేషన్ అనంతరం ఇవి వరుసగా 38, 26కు పెరిగే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. లోక్‌సభ స్థానాలు పెరిగితే వాటికి అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కూడా తప్పనిసరి అవుతుంది. ప్రస్తుతం ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సగటున ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో అసెంబ్లీ స్థానాలు కనీసం 225కు, తెలంగాణలో 153కు లేదా అంతకంటే ఎక్కువకు చేరే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

### అసెంబ్లీ తీర్మానాలు అవసరం లేదు

రాష్ట్ర ప్రభుత్వాలు లేదా అసెంబ్లీలు ప్రత్యేకంగా తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉండదని నిపుణులు చెబుతున్నారు. పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టం, రాజ్యాంగ సవరణలు అమల్లోకి వచ్చిన తర్వాత డీలిమిటేషన్ కమిషన్ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంది. కొత్త సరిహద్దులు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కేటాయింపులు కూడా అదే కమిషన్ నిర్ణయిస్తుంది.

### రాజకీయ సమీకరణాల్లో భారీ మార్పులు

అసెంబ్లీ స్థానాల పెంపుతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గాల ఏర్పాటుతో ద్వితీయ శ్రేణి నాయకులు, యువ నాయకులకు ఎమ్మెల్యేలుగా ఎదిగే అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిసరాలు, అమరావతి రాజధాని ప్రాంతం, వేగంగా విస్తరిస్తున్న పట్టణాల్లో కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ కొత్త వ్యూహాలు రచించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

### డీలిమిటేషన్ కమిషన్ కీలకం

రాజ్యాంగ సవరణలు అమలులోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆ కమిషన్ దేశవ్యాప్తంగా జనాభా, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా అవసరాలను పరిశీలించి కొత్త నియోజకవర్గాలను ఖరారు చేస్తుంది. తుది నివేదిక అనంతరమే కొత్త రాజకీయ పటానికి రూపురేఖలు సిద్ధమవుతాయి.

## పవన్ కళ్యాణ్ చెరువును
# కబ్జా చేయలేదు

**కోడి చెరువుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ**

**మట్టి నింపింది పవన్ కాదు, చెరువు స్వరూపం మారలేదన్న హైడ్రా**

**పవన్‌పై ఆరోపణలకు రంగనాథ్ చెక్**



**ముద్ర, హైదరాబాద్:** జన్వాడలోని కోడి చెరువు కబ్జా వ్యవహారంపై గత కొంతకాలంగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక స్పష్టత ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోడి చెరువును కబ్జా చేశారన్న ఆరోపణల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై జరిగిన పరిశీలనలో బయటపడిన విషయాలను వివరించిన రంగనాథ్, పవన్ కళ్యాణ్‌పై వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు.
హైడ్రా కమిషనర్ వెల్లడించిన వివరాల ప్రకారం, జన్వాడ కోడి చెరువు పరిసర ప్రాంతంలో పవన్ కళ్యాణ్‌కు భూమి ఉన్నది నిజమే. అయితే ఆ భూమిని ఆయన 2014లో చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ స్థలంలో కొన్ని ఎకరాలు ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) పరిధిలోకి వస్తున్నాయని గుర్తించినప్పటికీ, చెరువును ఆక్రమించడం లేదా చెరువులో మట్టి నింపడం వంటి చర్యలకు పవన్ కళ్యాణ్ పాల్పడలేదని స్పష్టం చేశారు.
అంతేకాకుండా, కోడి చెరువు అసలు స్వరూపంలో ఎలాంటి మార్పు జరగలేదని హైడ్రా కమిషనర్ వెల్లడించారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గేలా లేదా నీటి ప్రవాహానికి ఆటంకం కలిగేలా ఎలాంటి నిర్మాణాలు జరగలేదని ఆయన పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ భూమి కారణంగా చెరువుకు ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టంగా చెప్పారు. చెరువులో మట్టి నింపిన అంశంపై కూడా రంగనాథ్ వివరణ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ కాదు, చెరువు పక్కన ఉన్న ఇతర భూయజమానులే చెరువు పరిధిలో మట్టి నింపినట్లు విచారణలో తేలిందని వెల్లడించారు. ఈ చర్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా తెలిపారు.
హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలతో కోడి చెరువు వ్యవహారంపై కొనసాగుతున్న వివాదానికి కొత్త మలుపు తిరిగింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ చెరువును కబ్జా చేశారనే ప్రచారానికి ఆయన వ్యాఖ్యలు పూర్తి భిన్నంగా ఉండటం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. అధికారిక విచారణ ఆధారంగా వెల్లడించిన ఈ వివరాలు భవిష్యత్తులో ఈ అంశంపై జరుగనున్న చర్చలకు కీలకంగా మారనుంది.

# బండి.. ఈటెల.. రాజీ

**(మొదటి పేజీ తరువాయి)**
తెలంగాణా మీద బీజేపీకి ఆశలు ఎక్కువగానే ఉన్నాయి. ప్రజలలో బీజేపీ పట్ల సానుకూలత ఉందని దానిని సొమ్ము చేసుకోవాల్సిన తరుణంలో కీలక నేతల మధ్య విభేదాలు ఉండడం మంచి పరిణామం కాదని అధినాయకత్వం భావిస్తోంది. అందుకే తొలి ప్రయత్నంగా బండిని ఈటెలను కలసికట్టుగా ఉంచాలని నిర్ణయించింది అని అంటున్నారు. ఈ ఇద్దరు అగ్ర నేతలు చేతులు కలిపితే కనుక తెలంగాణాలో ముఖ్య ప్రాంతాలలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఒక అరుదైన సన్నివేశం అయితే చోటు చేసుకుంది.

**పార్టీ లైన్ లోనే అంటూ**

ఇదిలా ఉంటే తెలంగాణా బీజేపీ వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్ ఈ ఇద్దరు నేతలను పిలిపించుకుని మరీ రాజీ ఫార్ములా సెట్ చేశారు అని అంటున్నారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఇంట్లో జరిగిన సమావేశంలో ఈటెల బండిలను పక్క పక్కనే కూర్చోబెట్టి గతం గతహా అని చెప్పిన అభయ్ పాటిల్ గతంలో ఏమి జరిగినా ఇక మీదట వాటి ప్రస్తావన అన్నది వద్దే వద్దు అని స్పష్టం చేశారు. భవిష్యత్తు గురించే ఆలోచన చేయాలని కూడా అభయ్ పాటిల్ సూచించారు అని అంటునారు. పార్టీ చెప్పినట్లుగానే ఎవరైనా వినాలని పార్టీ లైన్ లో నడవాల్సిందే అని కూడా అభయ్ పాటిల్ చెప్పారని తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరు నేతలు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని చిరునవ్వులు చిందిస్తూ బయటకు వచ్చారు. మరి ఈ ఐక్యత కలిసి కట్టు తనం కనుక ముందు ముందు కొనసాగితే బీజేపీకి తెలంగాణాలో మంచి రోజులు వచ్చినట్లే. ఏమి జరుగుతుందో చూడాలి.



## ఉద్యమకారుల గుర్తింపులో
# జర్నలిస్టులకు ప్రాధాన్యతివ్వాలి



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ కోరారు. మంగళవారం నాడు ట్యాంక్ బండ్ లోని తెలంగాణ అమర జ్యోతిలో, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమంపై, జర్నలిస్టులతో ఉద్యమ గుర్తింపు కమిటీ నిర్వహించిన సంప్రదింపుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక–ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చారు.
అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు.
అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా యూనియన్ వినతిపత్రాన్ని కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాయక్, శోభన్ రెడ్డిలకు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# పరారీలో తమ్మినేని ఫ్యామిలీ!

**భూకబ్జా కేసులో అరెస్టు భయంతో కుటుంబంతో కలిసి అదృశ్యం**

**రూ.4 కోట్ల భూమి వివాదంలో 13 మందిపై కేసు.. ఇప్పటికే 8 మంది అరెస్టు.**

**నిందితుల జాబితా లో తమ్మినేని, కుమారుడు, భార్య**

**ముద్ర, అమరావతి:** ఉమ్మడి రాష్ట్రంలోనే సీనియర్ మోస్ట్ లీడర్ తమ్మినేని సీతారాం. తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగిన ఆయన సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశారు. తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఒకసారి ఎమ్మెల్యే అయ్యారు. స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవిని చేపట్టారు. అటువంటి నేత అరెస్టు భయంతో ఇప్పుడు కుటుంబ సభ్యులతో సహా పరారీ కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. శ్రీకాకుళం నగరంలో నాలుగు కోట్ల రూపాయల విలువైన భూమిని.. అసలు యజమానులు ఉండగా.. దొడ్డిదారిన కైవసం చేసుకోవడం వెలుగులోకి వచ్చింది. ఏ క్షణం అయినా అరెస్టు ఉంటుందన్న ప్రచారంతో తమ్మినేని తన కుటుంబంతో సహా పరారీ కావడం సంచలనంగా మారింది. ఇప్పుడు రాష్ట్రంలో ఇదే హాట్ టాపిక్.

**గత రెండు రోజులుగా ఇదే సంచలనం..**

గత రెండు రోజులుగా శ్రీకాకుళంలో సంచలనంగా మారింది ఈ కేసు. శనివారం సాయంత్రం ఎస్పి మహేశ్వర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి.. తమ్మినేని ఫ్యామిలీ ఎలా ఆ భూమిని కొట్టేసింది.. అందులో సూత్రధారులు ఎవరు? పాత్రధారులు ఎవరు అనే దానిపై స్పష్టతనిచ్చారు. ఈ కేసులో మిగతా వారిని అరెస్టు చూపించారు. కానీ స్పీకర్ తమ్మినేని, ఆయన కుమారుడు చిరంజీవి నాగ్, భార్య వాణి అరెస్టు విషయంలో న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్న తరుణంలో.. సోమవారం వేకువ జామున కుటుంబంతో సహా అదృశ్యమయ్యారు తమ్మినేని. అప్పటివరకు అద్దె ఇంట్లో ఉండగా.. ఇంట్లో కార్లు, సెల్ ఫోన్లు ఉంచి మరి.. తమ్మినేని కుటుంబంతో సహా పరారీ అయ్యారు. అరెస్టులో జాప్యం, పరోక్ష సహకారం వంటివి ఇందులో కనిపిస్తున్నాయి. అందుకే వారు తప్పించుకున్నట్లు అర్థం అవుతోంది. అరెస్టు తప్పదన్న సమాచారం వచ్చిన తరువాత మాత్రమే తమ్మినేని ఫ్యామిలీ పరారీ అయినట్లు శ్రీకాకుళం వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**8 మంది అరెస్ట్..**

ఆ భూమికి సంబంధించి అసలు యజమాని ఉన్నారు. అయినా సరే తమ్మినేని తన అధికార దర్పంతో అలా వ్యవహరించారు అనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 13 మంది నిందితులు ఉండగా 8 మంది అరెస్టు జరిగింది. తమ్మినేని కుటుంబంలోని ముగ్గురు నిందితులుగా ఉన్నారు. ఇప్పటివరకు ఈ కేసులో మాజీ హోం గార్డ్ త్రినాథ్, తెలుగు సతీష్ కుమార్, సాలిపల్లి లక్ష్మణరావు, రజిని, డాక్యుమెంట్ రైటర్ కోన పెద్దిరాజులు ఉన్నారు. అయితే అనూహ్యంగా ఈ రిజిస్ట్రేషన్ విషయంలో సాక్షులుగా సంతకాలు పెట్టారు తమ్మినేని కాలేజీలో పనిచేస్తున్న ఉపేంద్ర కుమార్, ఉపేంద్ర రావు, సాంబశివరావు, గోపాల కృష్ణలు. వీరంతా ఇప్పుడు అడ్డంగా బుక్కయ్యారు.



## వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం
# గ్రీన్ సిగ్నల్..



**ముద్ర, న్యూ ఢిల్లీ:** తెలంగాణలో విమానయాన రంగానికి కీలక ఊతమిచ్చే నిర్ణయంగా వరంగల్ మామ్నూర్ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.496.86 కోట్ల అంచనా వ్యయంతో మామ్నూర్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) ఆమోదం తెలిపింది. ఈ మేరకు రన్‌వే, అప్రాన్, ట్యాక్సీవే, బౌండరీ వాల్ తదితర మౌలిక వసతుల నిర్మాణానికి ప్రాథమిక టెండర్లను కూడా విడుదల చేసింది.రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భూసేకరణ, పర్యావరణం సహా చట్టబద్ధ అనుమతులు పూర్తయిన తర్వాతే నిర్మాణ పనులు వేగవంతం అవుతాయని, విమానాశ్రయం ప్రారంభ సమయం కూడా అదే ప్రక్రియపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.
ఉడాన్ (UDAN) పథకం కింద తెలంగాణలో ఇప్పటివరకు 58 విమాన మార్గాలు అందుబాటులోకి వచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి టెక్నో–ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనం పూర్తిచేసి, అవసరమైన భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపింది. పెద్దపల్లి విమానాశ్రయానికి ప్రీ–ఫీజిబిలిటీ నివేదిక సమర్పించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత ప్రాంతాల్లో కొండలు, రైల్వే లైన్ల కారణంగా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని ఏఏఐ నిర్ధారించినట్లు పేర్కొంది.
ఇదిలా ఉండగా, తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజ్యసభలో వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో తొలి దశను రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అమలు చేసిందని, ఆ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ (VGF) కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎలాంటి మెట్రో ప్రాజెక్టు అమల్లో లేదని స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 22.07.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# వంకర విన్యాసాలు

## (వంకరటింకరలు)

వంకర బుద్ధులు పెరుగుతున్నాయి,
విలువల వేర్లు తెగిపోతున్నాయి,
వివేక దీప్తులు మసకబారుతున్నాయి,
వంచన మేఘాలు కమ్ముతున్నాయి॥

వంకర నడతలు నడుస్తున్నాయి,
నీతిని నెట్టివేస్తున్నాయి,
నిజం నడిచే బాటను వదలి
నీచ మార్గాలు వెదుకుతున్నాయి॥

వంకర మాటలు వినబడుతున్నాయి,
విషపు జల్లులు కురిపిస్తున్నాయి,
తేనె పూసిన పెదవుల వెనుక
తీరని తుఫాన్లు దాచుతున్నాయి॥

వంకర మార్గాలు విస్తరిస్తున్నాయి,
మనసుల దిక్కులు మార్చుతున్నాయి,
అడ్డదారుల ఆకర్షణతో
ఆత్మగౌరవం అమ్ముతున్నాయి॥

వంకర చూపులు చూస్తున్నాయి,
లోపాలనే లెక్కిస్తున్నాయి,
పర్వతమంత మంచితనాన్ని వదిలి
పొరపాటునే పెద్దదిగా చేస్తున్నాయి॥

వంకర చేష్టలు సాగుతున్నాయి,
వింత నాటకాలు ఆడుతున్నాయి,
ఒకటి చెప్పి మరొకటి చేసి
ఊసరవెల్లులై తిరుగుతున్నాయి॥

వంకర రాబడులు వస్తున్నాయి,
వంచన గూడులు కడుతున్నాయి,
చెమట చుక్కల విలువను మరిచి
చీకటి దారులు ఎంచుకుంటున్నాయి॥

వంకర రాతలు రాస్తున్నాయి,
వాస్తవాలను వక్రీకరిస్తున్నాయి,
అక్షరాలకు అలంకారాలు అద్ది
అసత్యాలకు అభిషేకం చేస్తున్నాయి॥

వంకర మనుషులు పెరుగుతున్నారు,
మమతల మూలాలు నరికేస్తున్నారు,
మనిషిలోని మానవత్వాన్ని
మాయల సంతలో వేలం వేస్తున్నారు॥

వంకర బతుకులు బ్రతుకుతున్నాయి,
బంధాలను దూరం చేస్తున్నాయి,
ధనం గుట్టలు పేరుకున్నా
ధర్మాన్ని మాత్రం కోల్పోతున్నాయి॥

అయినా... సూటి బుద్ధులు నిలవాలి,



సత్య నడతలు సాగాలి,
మధుర మాటలు పలకాలి,
మంచి మార్గాలు వెలగాలి॥

నిర్మల చూపులు వికసించాలి,
నిస్వార్థ చేష్టలు పెరగాలి,
న్యాయ రాబడులు రావాలి,
నిజమైన రాతలు నిలవాలి॥

మంచి మనుషులు మిగలాలి,
మానవత పరిమళించాలి,
అందమైన బతుకులు విరియాలి,
ఆనంద దీపాలు వెలగాలి॥

అప్పుడు ఈ భువి నందనవనమై,
ఆనందగీతం ఆలపిస్తుంది,
మనిషి మనిషిని ప్రేమించే
మానవ యుగం ఆవిష్కృతమవుతుంది॥

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం.**

# పాకిస్థాన్‌కు భారత్ హెచ్చరిక

**ఉగ్రవాదం ఆపితేనే సింధు జలాలు, కెనడాలోనూ పాక్‌కు ఎదురుదెబ్బ..**
**కశ్మీర్, జలాల వివాదంపై స్పందించని ఒట్టావా**

**ముద్ర, న్యూ ఢిల్లీ:** సరిహద్దు ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేస్తేనే సింధు జలాల ఒప్పందం భవిష్యత్తులో పునరుద్ధరణపై ఆలోచిస్తామని భారత్ స్పష్టం చేసింది. ప్రస్తుత రూపంలో ఈ ఒప్పందం మళ్లీ అమలులోకి వచ్చే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశ సార్వభౌమాధికారానికి, భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితుల్లో ఒప్పందం నుంచి వైదొలగడానికీ వెనుకాడబోమని పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశాయి. ఉగ్రవాదానికి అండగా నిలుస్తూనే జలాల ఒప్పందం అమలు చేయాలని కోరడం సాధ్యం కాదని భారత్ తేల్చిచెప్పింది.
ఇదే సమయంలో అంతర్జాతీయ వేదికలపై భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కెనడా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్.. కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సింధు జలాల ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ, దీనిపై కెనడా జోక్యం చేసుకోవాలని కోరినట్లు సమాచారం. అలాగే కశ్మీర్ అంశంలోనూ మధ్యవర్తిత్వం వహించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.
అయితే ఈ భేటీ అనంతరం విడుదల చేసిన ఇరు దేశాల అధికారిక సంయుక్త ప్రకటనలో సింధు జలాల ఒప్పందం, కశ్మీర్ అంశాల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీంతో పాకిస్థాన్ లేవనెత్తిన అంశాలకు కెనడా ప్రాధాన్యం ఇవ్వలేదని స్పష్టమైంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టాలన్న ఇస్లామాబాద్ ప్రయత్నాలు మరోసారి ఫలించకపోవడంతో పాకిస్థాన్‌కు దౌత్యపరంగా గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది.
భారత్ మాత్రం తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తోంది. సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి చెప్పకుండా సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణకు అవకాశం లేదని, జాతీయ భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు మరోసారి స్పష్టం చేశాయి.



## వర్తమాన పోకడకు దర్పణం

# నిలువుటద్దం

ఎదలోని భావాలను ఒక్కొట్టొక్కటి ఏరుకొచ్చి ఓ తెల్లని కాగితం మీద పోసి,వాటిని ఓ అందమైన అమరికలో అమరిస్తే అవుతుంది అది ఒక 'కవిత.'
సాధారణ వ్యక్తులు కేవలం తమ భావాలను తమకు కావలిసిన వారికి తెలుపడానికి రాస్తారు. కానీ ప్రత్యేకమైన వ్యక్తులు మాత్రం తమకు కావలిసిన వారికే కాదు చదివిన ప్రతి ఒక్కరికి మళ్ళీ మళ్ళీ చదవాలనే ఉత్సుకతను కలిగించే విధంగా ఏదో ఒక ప్రత్యేకతను ఆ రాతలో కనిపించే విధముగా రాస్తారు.

**మనం దానినే 'కవిత' అంటాం.**

ఇంకా చెప్పాలంటే.. తన చుట్టూ జరిగే సంఘటనలు,ప్రకృతి అందాలు, మానవ భావోద్వేగాలగు సంతోషం, బాధ, ప్రేమ, ఆవేదనలు ఇంకా సామాజిక సమస్యలను తన ఊహతో అక్షర రూపంలోకి మార్చే వ్యక్తులను 'కవి' అంటారు.అందుకే "రవి గాంచని చోట కవి గాంచును" అంటారు. కవులు బాధలో ఉన్నవారికి ఓదార్పునివ్వగలరు మరియు సమాజానికి చైతన్యం తీసుకురాగలరు.
నూనూగు మీసాల మన ఓ పాతికేళ్ల
కుర్రాడు, ప్రస్తుత సమాజ పోకడను తన పరిశీలనతో పసిగట్టి, తన కలమును చేతబట్టి, తనకు కలిగిన భావాలను అదిమిబట్టి,తన 'నిలువుటద్దం'లో బంధించాడు.
అతడే "తొరకొప్పుల దిలీప'.
మూడు పదుల వయస్సు దాటని 'దిలీప' ముప్పై ఒక్క కవితలతో "నిలువుటద్దం" కావ్యమును వెలువర్చాడు. ఇప్పుడు సమాజంలో యువత పరాయి భాషా మోజలో పడి మాతృభాషకు దూరమవుతున్న నేటి కాలంలో, అలాగే ప్రేయసి మోజలో పడి జన్మనిచ్చిన తల్లిదండ్రులను దూరం పెడుతున్న నేటి కాలంలో.. దిలీప్ మాతృభాష పట్ల మమకారమును పెంచుకున్నాడు, అలాగే ఈ కృతిని కని,పెంచిన తల్లిదండ్రులకు అంకితమిచ్చాడు. ఈ విధంగా మాతృభాష మరియు మాతృమూర్తుల పట్ల తన భక్తిని చాటుకున్నాడు. ఇలాంటి వారు నేటి సమాజంలో చాలా అరుదుగా ఉంటారు.
"నీ చిరునవ్వు జాడేది అంటుంది
నిన్ను నడిపించే మనసెక్కడా అంటుంది
నీ బంధుబలగమెక్కడా అంటుంది
నీ తెలివితేటలు చూపించు అంటుంది
తల ఎత్తి గర్వంతో మాట్లాడు అంటుంది."
ఇక సెలవంటే కలిగే ఆనందాల గూర్చి 'సెలవు'లో చెప్తాడు. పదాల మార్పులతో '10వ తరగతి ఆనందాలు' రాసిన తీరు చూడండి ఆకట్టుకుంటుంది.
"దెబ్బలు తినని రోజు లేదు
దెబ్బలు పడని చోటు లేదు
పరీక్షల్లో వచ్చిన మార్కులు
చేయలేని హోమ్ వర్కులు
బడికి వెళ్తే కాళ్ల నొప్పులు
ఇంట్లో వాళ్ళతో తిప్పలు"
ఇవి చాలవా మనకు ఇంకేం కావాలి"
బుక్కెడు బువ్వకు దక్కిన పాణము అంటూ 'రైతన్నా నీ పుణ్యం' అనే కవితలో అతని కవితా దాటిని ఒకసారి చూడండి.
"భూమిని చీల్చి, గింజలు వేసి
ఎదురుచూస్తావు ఎండల్లో,వానల్లో
మాపై నీకు జాలయ్యో
నీపై ప్రేమ మాకు లేదయ్యో
తిని బలిసాము మేమయ్యా
మిగిలిన మెతుకులు నీకయ్యా
బానిసవో, మమ్మల్ని బతికించే దేవుడివో
బుక్కెడు బువ్వకు దక్కిన ప్రాణం
రైతన్నా నీ పుణ్యం రైతన్నా నీ పుణ్యం"
విత్తనాలేసి,చినుకు కోసం ఎదురచూసి కష్టపడి పండించిన తిండిని తిని బలిసి, నిన్ను బానిసగ చూస్తాము, డబ్బులు లేక తిండి లేని రోజున దేవుడోలే నీవు పెట్టిన బుక్కెడు బువ్వ పాణాన్ని కాపాడిన తీరుకు దేవుడంటూ. రైతును దయామయుడుగా ఆవిష్కరిస్తాడు. చిన్న,పెద్ద; ఆడ,మగ; కులం,మతం; జాతి,రీతి; పేరు,ఊరు ఇవేవీ అవసరం లేకుండా అందర్నీ సమానంగానే కరోనా చూసింది. అప్పుడు హద్దులు మనమే ఎన్నో పెట్టుకున్నాము మరల పైస కోసం పాటించకుండా పోతున్నాము అని చెప్పేసి 'నేనొచ్చానని భయమే లేదు' అనే కవితలో కరోనా నాటి పరిస్థితులను ఏకరువు పెడతాడు కవి.
ఇంకా 'కాలానికి ఈ విషయం తెలియదేమో' అనే కవితలో
"కొందరికి సమయం సాయం చేస్తుంది
మరికొందరిపై పంతం సాధిస్తుంది"అని కాల మహిమను తెలుపుతూ ఇంకా
"గడిచిన రోజు గురించి బాధపడకు
రేపటి గురించి ఆలోచించకు
ఈ నిమిషం నిర్లక్ష్యం చేయకు"
అంటు,కాలం యొక్క తత్వాన్ని బోధపరస్తాడు. కాలాన్ని నిర్లక్ష్యం చేయుటవలన తన కలిగిన స్వీయనుభవమునిలా రాసాడు.
" కాలాన్ని చులకన చేసి చూశా
ఇప్పుడు నవ్వుతుంది ఈ క్షణం నన్ను చూసి
గడియారాన్ని కొన్నంత మాత్రాన నన్ను ఆపలేవు
నీవు నాతో నడవలేవు అంటూ
నన్ను తినేసేలా చూస్తూ







**దాసరి శ్రీరాములు,**
**ఉపాధ్యక్షులు,తెలంగాణ సాహితి, నల్గొండ,**
**తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూ. కళాశాల,**
**నాగార్జున సాగర్.**

నన్ను వెక్కిరింతల పాలు చేస్తూ ఆనందిస్తోంది
సమయానికి నాతో చిట్ చాట్ చేస్తూ
చిరునవ్వులు నవ్వుకుంటూ
వెళ్లిపోయింది ఆగకుండా
నా ప్రయాణాన్ని సాగకుండా చేసి"
మన యువకవి ఓ తియ్యని "అందమైన ఓ మాయ" కలగన్నాడు, చివరకు మాయజేసి నిరుత్సహపుముగింపుయిచ్చాడు చూదుర్రి.
" కల్మషము లేని నవ్వుతో నన్ను నవ్విస్తూ
నాలో ఆరాటాన్ని ఆశలను రేకెత్తిస్తుంది
ఈ రేయిలో చల్లటి గాలితో కబురంపినట్టుగా
తన శ్వాసలో ఒదిగిపోయిన గాలి కూడా
వెచ్చగా నాలో సెగలు రేపుతోంది.
తన ఒడిలో చంటి పిల్లాడిలా ఒదిగిపోయా
తన ప్రేమలో మునిగిపోయా
తన కౌగిలిలో బంధీనై పోయా
తన ఎదలో 'రాజు'గా నిలిచిపోయా ఆనందంలో మునిగి పోయా
అదంతా ఓ అందమైన మాయా
అదే సమయంలో నిద్ర పోయా.. "
"ప్రజలు మెడిసిన్స్ బతానీలు కొన్నట్టుగా కొంటున్నారు
మెడికల్ షాప్ వాళ్లు మెడిసిన్స్ చాక్లెట్స్ అమ్మినట్టు అమ్ముతున్నారు
గోలికి వెయ్యి సూదికి లచ్చ"
లాగ మెడికల్ మాఫియా సాగుతుందని బాధపడుతాడు.రోగుల పట్ల సానుభూతి చూపుతాడు.
ఓట్లుకు ఓ రేటు నిర్ణయించి నాయకులు కొంటుంటే ఓటర్లు చదువుకున్న నిరక్ష్య కుక్కలవలె అమ్ముకుంటున్నారని ఇదో 'రాజకీయ మాఫియా' "కొందరు అంబేద్కర్ గారి నీడలో బ్రతకగలరు కానీ వారి అడుగుజాడల్లో అస్సలు నడవరు" అని రాజ్యాంగాన్ని వాడుకుంటున్నారు కాని అంబేద్కర్ లా.. బతుకలేకపోతున్నారని బాధపడుతాడు.
"చుట్టాలందరూ గొడవలు పడితే వాళ్ళ పిల్లల పిల్లలు కోపాన్ని ద్వేషాన్ని ఆచారంగా పాటిస్తున్నారు. పాలరాతి సమాధి కట్టి పదిమందికి పంచభక్ష పరమాన్నాలు పెడితే చనిపోయిన వారిపై ప్రేమ తెలిపినట్టా?"
నేటి ప్రేమ ముసుగులో..
"అమ్మాయిలకి డబ్బున్న అబ్బాయిలు కావాలి
అబ్బాయిలకి సుఖమిచ్చే అమ్మాయిలు కావాలి"
అనడంలో కవి సామాజిక స్పృహ కనిపిస్తుంది.
'నిలువుటద్దం'అనే కవిత సాంద్రమైనది ఎందుకంటే.. ప్రసిద్ధి చెందిన పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 'ఆస్తానకవి దాశరథీ' గారి గొప్ప పాట
"భూగోళం పుట్టుక కోసం రాలిన సుర గోళాలు ఎన్నో..
ఈ మానవ రూపం కోసం జరిగిన పరిణామాలు ఎన్నో..
ఒక రాజును గెలిపించుటలో ఒరిగిన నరకంతాలేన్నో..
కులమతాల సుడిగుండాలకు బలి అయిన పవిత్రులందరో..
ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడ బాణాల మెంతో..
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరలెందరో... "
ను తలపించేలా దిలీప్ రాసిన కవితను చూడండి.
"మనుషుల ఆకలి కోసం చచ్చిన జీవాలెన్నో..
దేవుడి మొక్కుతో తెగిన మూగ జీవాల గొంతుకలెన్నో..
చీకటిలో జరిగే ఘోరమైన మానబంగాలు ఎన్నో..
డబ్బుతో కొట్టేసిన న్యాయస్తానాల కేసులు ఎన్నో.."
'సమాజాన్ని నిందించాలా !' అనే ఈ కవితలో సమాజం చేస్తున్నది ఎవరి కోసం?ఎందుకోసం? అంటూ కవి ఇలా ప్రశ్నిస్తాడు "కుళ్ళిపోయే దేహానికి ఖరీదైన సుగందాలెందుకు?
మాట రాని రంగు కాగితానికి ఆ విలువ ఎందుకు?
అవసరానికి ఉపయోగపడని డబ్బు అది ఎందుకు?
మార్చలేని గతాన్ని తలుచుకొని ఏడవడం ఎందుకు?
నలుగురిలో నవరస నాటకాలు ఒలికించుట ఎందుకు?
వరాలు ఇవ్వని దేవుని గొప్పగ పూజించడం ఎందుకు?
ప్రాణములుయే లేని వస్తువులపై ప్రేమ ఎందుకు?
సంపాదించే వయసున్న కొడుకులకు తాతల ఆస్తి ఎందుకు?"
ఇందులో కవి తార్కికత, హేతుబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది.
'నా జీవితం' కవితలో శాస్త్రీయ దృక్పథం కనిపిస్తుంది.
'మంచివారు – ముంచేవారు' నిజమైన మంచివారు రూపంలో ముంచేవారే ఎక్కువని, 'స్వేచ్ఛ – బాధ్యత' ఆ పదాల అర్థం తెలుపుతూ.., 'నరులు – మహానరులు' 'అదృష్టం మరియు దరిద్రం' కవితలలో పదజాల విన్యాసాలను చక్కగా ప్రదర్శిస్తారు.
లోతైనా తాత్వికతను 'ఒక్క రోజు' లో చూడండి
" తల్లడిల్లకు శోకసంద్రంలో ఉన్నావని
ప్రతి ఒక్కటి అనభవించాల్సిందే..
నీ కోసము నువ్వు నీలానే బతుకాలి.
కాలం మారుతుందని
నీ ముందున్న క్షణమే నిజమని
అది గడిచిపోతే తిరిగి రాదని బాధపడకు
ఆయువుండాలే గానీ ఏదైనా సాధించవచ్చు
ఒక్కరోజు చాలు
వంద ఏళ్ళు గుర్తిండేలా చేయడానికి"
సినిమా తీసే విధానం, దాని ఉద్దేశం సినిమా తత్వం గూర్చి 'సినిమా' కవితలో ఇంకా డైరెక్టర్లు,హీరోలు,లోకేషన్, క్రైమ్, రొమాన్స్, మ్యూజిక్ డైరెక్టర్లు, రిలీజ్ అయిన రోజున థియేటర్ల హడావిడి, సినీ దోపిడీ,ప్రేక్షకుల ఉత్సకత గురించి చక్కగా తెలిపారు కవి దిలీప్ గారు.
మనకంటూ ఓ రోజు వస్తది, అది మన రోజు అవుతది అందుకోసం నిరీక్షించమని 'నమ్మకం' అనే ఓ ఆశవాద దృక్పథ కవితలో కవి అంటాడు.
కవికి కూడా మనసుంటది, అది ప్రేమిస్తది కూడా ఎంతైనా యువకుడు గదా.. అయితే ఆ ప్రేమ విఫలమైన బాధను 'తను' లో చెప్పుకుంటాడు.ఓ సారి మీరు చూడండి.
ఐతే 'అమ్మ' ఇచ్చే ప్రేమ,ఆమె ఇచ్చే భరోసా గూర్చి..
"కడుపు నిండుతుంది
జేబు నిండుతుంది
కారణం
నేను అమ్మ దగ్గర ఉన్నాను" అంటారు.
ప్రాచీన సంస్కృత కవుల దృష్టిలో.. కవిత అనగా "కేవలం పదాల కూర్పు కాదు, అది హృదయానికి ఆనందాన్ని, రసానుభూతిని కలిగించే అద్భుత సృష్టి." ఇలా రసానుభూతిని కలిగించేవి కూడా ఉండుటచే ఈ కవిని, తన ప్రయత్నాన్ని మెచ్చుకోవాల్సిందే.. అందుకే ఈ కింది, నా కంద పద్యముల తోడ ముందుగా నేనే మొదటగా అతనికి శుభాకాంక్షలు తెల్పుతాను.
"నిలువుటద్దం"కు శుభాకాంక్షలు ??

కం. అలవోకగను పద కవన
ములు రాసిన యువకుడొకడు మూడు పదుల లో
పల వయసున్నను మించిన
పలు పలు ఆలోచనలన పదములు రాసెన్!!

కం. నూతనకవిగా చేరె
న్నీతడు సాహితి వనమున హితమును కోరెన్
పాతిక యేండ్లున బహుజన
జాతికి రత్నమితడయ్యి జగమున మెరిసెన్

కం. ముప్పై ఒక కవితలతో
గొప్పగ నొక పుస్తకంబు కోరియు రాసెన్!
చప్పగ కొన్నున్నెక్కువ
ఒప్పును కవనాలు యుండెనుర్వియు మెచ్చన్!!

కం. నిలబడి యాలోచనతో
కలబడి రచయించెనితడు కావ్యమునొకటిన్!
నిలిపె "నిలువుటద్దం"గా
దిలీపునకు కీర్తి తెచ్చె ధీమంతుడగున్!!

ఇలా తన తొలి సంపుటి 'నిలువుటద్దం'లో సమాజంలో నేడు వస్తున్న పెను మార్పులను, అలాగే యువతలో వస్తున్న ఆలోచన ధోరణులను, చదువు విలువను, రైతు శ్రమను, అమ్మ మనస్సును, బాల్యం యొక్క తీపి గుర్తులను ప్రియురాలి వియోగంతో వచ్చిన దు:ఖాన్ని ఇలా చిన్న వయస్సులోనే అన్ని రకాల భావోద్వేగాలను ఒక కవితా సంపుటిలో తెలియజేయడం గొప్ప విషయం. ముందు ముందు మరెన్నో కవితా సంపుటాలు వెలువరించాలని కొరుకుంటూ.

# అప్పుల భారత్

**మన నెత్తిమీద అక్షరాల ₹201 లక్షల కోట్ల అప్పు**
**11 ఏళ్లలో కేంద్ర అప్పు 214% పెరుగుదల**
**₹201.17 లక్షల కోట్లకు చేరిన కేంద్ర రుణభారం**
**పదేళ్లలో ₹125.99 లక్షల కోట్లు కొత్త అప్పులు**
**హైవేలు, రైల్వేలు, డిఫెన్స్‌కు భారీగా వినియోగం**
**₹30.94 లక్షల కోట్లు తిరిగి చెల్లించిన కేంద్రం**

**ముద్ర డెస్క్:** దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక గణాంకాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ మొత్తం అప్పు 2025–26 ఆర్థిక సంవత్సరం నాటికి ₹201.17 లక్షల కోట్లకు చేరిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ తెలిపారు. ఈ వివరాలను పార్లమెంట్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా వెల్లడించారు. మంత్రి వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం అప్పు ₹64.11 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం అది ₹201.17 లక్షల కోట్లకు పెరిగింది. అంటే గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వ అప్పు దాదాపు 214 శాతం పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం భారీగా రుణాలు సమీకరించినట్లు మంత్రి వివరించారు. ఈ కాలంలో మొత్తం ₹125.99 లక్షల కోట్ల మేర కొత్త అప్పులు తీసుకోగా, అదే సమయంలో ₹30.94 లక్షల కోట్ల రుణాలను తిరిగి చెల్లించినట్లు పేర్కొన్నారు. అప్పుల నిర్వహణతో పాటు, రుణ చెల్లింపులను కూడా ప్రభుత్వం కొనసాగించిందని తెలిపారు.

అయితే ఈ రుణాలను కేవలం సాధారణ ఖర్చుల కోసం కాకుండా, దేశ అభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం వినియోగించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వే విస్తరణ, పోర్టుల అభివృద్ధి, విమానాశ్రయాల నిర్మాణం, రక్షణ రంగ బలోపేతం వంటి కీలక ప్రాజెక్టులపై సగానికిపైగా నిధులు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ఈ పెట్టుబడులు పెట్టామని ప్రభుత్వం పేర్కొంది. అయితే కేంద్ర ప్రభుత్వ అప్పు ₹200 లక్షల కోట్ల మార్క్‌ను దాటడం ఆర్థిక వర్గాల్లో చర్చకు దారితీసింది. ఒకవైపు భారీ అప్పులు భవిష్యత్ తరాలపై ఆర్థిక భారం పెంచుతాయని విమర్శలు వినిపిస్తుండగా, మరోవైపు మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు కోసం ఇలాంటి పెట్టుబడులు అవసరమేనని ప్రభుత్వం వాదిస్తోంది. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన తాజా గణాంకాలతో దేశ అప్పుల స్థాయి, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కోసం తీసుకుంటున్న రుణాలపై మరోసారి జాతీయ స్థాయిలో విస్తృత చర్చ మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.



దోమల నివారణకు
**పూర్తి చేతుల దుస్తులు ధరించండి**
ఉదయం, సాయంత్రం వేళల్లో దోమలు ఎక్కువగా కుడతాయి. ఈ సమయంలో పూర్తి చేతుల చొక్కాలు, పొడవైన ప్యాంట్లు ధరించడం మంచిది. చిన్నారులు బయట ఆడుకునేటప్పుడు కూడా పూర్తి శరీరాన్ని కప్పే దుస్తులు వేయించండి.



## రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

<u>ముద్ర, మియాపూర్, జూలై 21:</u>

మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీకి చెందిన నాగభూషణ రావుకు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్–ఎల్ఓసీ మంజూరి పత్రాన్ని గౌరవ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరప్రసాదంగా మారిందన్నారు. ప్రజల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందని, వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చులకు ఈ నిధి ఆర్థిక భరోసాను కల్పిస్తోందని తెలిపారు.

తమకు అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభం

<u>ముద్ర, కొండాపూర్, జూలై 21:</u>

కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోల్డెన్ తులిప్ కాలనీ ప్రజలకు అన్ని సౌకర్యాలతో కూడిన ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. "ఆరోగ్య శేరిలింగంపల్లి" లక్ష్యంగా ప్రతి కాలనీ, ప్రతి పార్కులో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, వృద్ధులు, యువత, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గాంధీ స్పష్టం చేశారు. మెరుగైన ప్రజా జీవనానికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నానని, కొండాపూర్ డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గోల్డెన్ తులిప్ కాలనీ ప్రతినిధులు విద్యాసాగర్ రెడ్డి, రాజు, సత్యనారాయణతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెండింగ్ రోడ్డు పనులను ప్రారంభించండి

<u>ముద్ర, కాప్రా:</u>

ఉప్పల్ వెంకట సాయి నగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను తక్షణమే మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు,విజయేందర్ రెడ్డి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి కాలనీలోని పలు అంతర్గత వీధులు ఇప్పటికీ మట్టి రోడ్లుగానే ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారి చిన్నారులు, వృద్ధులు, మహిళలు నిత్యావసర పనుల కోసం బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు, ఇతర సేవా వాహనాలు కాలనీలోకి సులభంగా చేరుకోలేని పరిస్థితి నెలకొన్నదని వివరించారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారు. కాలనీలో సీసీ రోడ్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని కోరుతూ సంబంధిత జోనల్ కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా తన సిఫారసు లేఖను పంపించారు.

## ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**ముద్ర కూకట్ పల్లి :** కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ఫోర్త్ ఫేస్ వెంచర్–2 లో ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బండి రమేష్ సూచన మేరకు మైనార్టీ లీడర్ మద్దూం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈ వేడుకల్లో కేపీహెచ్‌బీ డివిజన్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, బాలాజీ నగర్ ప్రెసిడెంట్ వి.ఆర్.ఎస్. గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రాజు, మేకల మైఖేల్, బాబ్జి, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, జయలక్ష్మి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, అపర్ణ, సుందరి, సాయి, వంశీ, రవి, సూర్యనారాయణ, శివాజీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నాగార్జున నగర్ లో మున్సిపల్ కమిషనర్ తనిఖీ

**- అక్రమ నిర్మాణాలు, వ్యర్థాల తొలగింపునకు ఆదేశాలు**

<u>ముద్ర, కాప్రా, జూలై 21:</u>

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, కాప్రా సర్కిల్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో క్షేత్ర స్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారులు, ప్లాంటర్ బాక్స్‌ల పరిస్థితిని పరిశీలించిన కమిషనర్, ఖాళీగా ఉన్న అన్ని ప్లాంటర్ బాక్స్‌లను గుర్తించి వెంటనే మొక్కలు నాటాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమన్వయంతో మొక్కల సంరక్షణ, నిర్వహణ చేపట్టాలని సూచించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి ప్లాంటర్ బాక్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని పేర్కొన్నారు.

రహదారులపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, ఇతర ఆక్రమణలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ శాఖకు ఆదేశించారు. అలాగే రోడ్లపై పేరుకుపోయిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తొలగించి, అవసరమైన చోట తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలను పూడ్చేందుకు వాటిని వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కొత్తగా చేపట్టే నిర్మాణ పనులు అధీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌తో అనుసంధానం చేసుకుని నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.



వాణిజ్య సంస్థలు తమ ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, హాస్టళ్లు ట్రేడ్ లైసెన్స్‌తో పాటు సంబంధిత అన్ని చట్టబద్ధ అనుమతులు, రికార్డులను నిర్వహించాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై ఎలాంటి మినహాయింపు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వాటిని పరిశుభ్రంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని, అక్రమంగా చెత్త పారబోయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నగర పరిశుభ్రత, పచ్చదనం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, నిబంధనల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని అందించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

<u>ముద్ర, కుషాయిగూడ:</u>

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఈసీఐఎల్ చౌరస్తా లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నీట్‌తో పాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, సీబీఎస్ఈ ఫలితాల నిర్వహణలో లోపాలు, ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు.




నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి వచ్చిన తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించినప్పటికీ, హాల్‌టికెట్లలో లోపాలు, పరీక్షా కేంద్రాల కేటాయింపులో గందరగోళం కొనసాగిందని తెలిపారు. కొంతమంది విద్యార్థులకు విదేశాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించడం ఎన్ టీఏ పనితీరులోని ఘోర వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు కష్టపడి చదువుతుంటే, తల్లిదండ్రులు అప్పులు చేసి లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్‌లు ఇప్పిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం తన వైఫల్యాల కారణంగా వారి జీవితాలతో ఆటలాడుతోందని మండిపడ్డారు. వ్యవస్థ వైఫల్యాల కారణంగా విద్యార్థుల కలలు కూలిపోతున్నాయని, వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ నిర్లక్ష్యపూరిత విద్యా విధానాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే సమా ధానం చెప్పాల్సిన ప్రభుత్వం, వారిపై పోలీసులతో దాడులు చేయించడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థుల గొంతును లాఠీలతో అణచివేయాలని చూస్తున్న ఈ పిరికి ప్రభుత్వం ఉద్యమాలను ఆపలేదని, ఇకపై కూడా ఆపలేదని స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు.

ఈ ర్యాలీకి ఎస్ఎఫ్ఐ కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ అధ్యక్షత వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చ ల్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, నాయకులు ఆకాశ్, ప్రశాంత్, మనీష్, జ్యోతీంద్ర, యశ్వంత్, అరుణ్, చిరంజీవి, గౌతమ్, టిల్లు, మనీష్, విఘ్నేష్ తదితరులు పాల్గొ న్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎల్‌నినో ప్రకృతి విపత్తు నేపథ్యంలో కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు తీసుకురావాలని ఆయన బీజేపీని డిమాండ్ చేశారు. క్యూర్ చట్టంపై ప్రభుత్వం అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహిస్తుందని, అన్ని పార్టీలకు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి తమది కాదన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని కోరిన మంత్రి, తెలంగాణపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించాలని సూచించారు. కేంద్రం విడుదల చేసే నిధులు తెలంగాణ ప్రజల పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటా మాత్రమేనని స్పష్టం చేశారు.

## శ్మశానవాటిక పరిరక్షణకు నిరసన దీక్ష



<u>ముద్ర, కాప్రా:</u>

హిందూ మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర నాయకుడు ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్ హెచ్చరించారు. చిన్న చర్లపల్లి లోని హిందూ శ్మశానవాటిక పరిరక్షణ కోసం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ శ్మశానవాటిక హిందువులకే చెందాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మునిగంటి రామ్‌ప్రదీప్, ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ఎస్సీ మోర్చా కన్వీనర్ తాళ్లపల్లి లింగం తో పాటు కాప్రా నాచారం ఉప్పల్ ప్రాంతాలకు చెందిన బిజెపి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యకర్తలు, స్థానికులు నిరసన ధర్నాలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్

<u>ముద్ర, కూకట్ పల్లి, జూలై 21:</u>

ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ శ్రీ చిత్తారమ్మ తల్లి ఆలయం, హైదరాబాద్‌లోని బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయాలను టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సందర్శించారు. ఇరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దళిత, పేద రైతుల భూములకు న్యాయం చేయాలి

**- కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ డిమాండ్**

<u>ముద్ర ప్రతినిధి, తాండూర్, జూలై 21:</u>

వికారాబాద్ జిల్లా యాలాల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మహేందర్ మాట్లాడుతూ, దౌలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 75లో దళిత, వడ్డె కులాలకు చెందిన 11 కుటుంబాలకు కేటాయించిన 13 ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో రైతులకు సమాచారం ఇవ్వకుండా వినియోగిస్తున్నారని ఆరోపించారు.

రైతుల పొలాల నుంచి ఎర్రమట్టిని తరలించి సాగుకు అనువుగా లేకుండా చేశారని, ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి లేదా తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళిత, పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వడ్డె చంద్రమ్మ, అంజలమ్మ, బుడ్డమ్మ, రవి, వెంకటయ్య, కృష్ణ, కోనగిరి చంద్రప్ప, మొనెప్ప, అంజలమ్మ, వెంకటయ్య, బాలరాజ్, సత్యమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.



**దోమల నివారణ ఉత్పత్తులను సురక్షితంగా ఉపయోగించండి**



మస్కిటో రిపెలెంట్ క్రీములు, లిక్విడ్ వేపరైజర్లు, ఎలక్ట్రిక్ బ్యాట్లు, స్ప్రేలు లేదా కాయిల్స్‌ను అవసరానికి అనుగుణంగా వాడండి. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్న ఇళ్లలో వైద్యుల సూచనలకు అనుగుణంగా సురక్షిత ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం మంచిది.

## నిర్మల్ జిల్లా డాగ్ స్క్వాడ్ కు రాష్ట్ర స్థాయి గుర్తింపు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం విడుదల చేసిన 2026 తొలి అర్ధవార్షిక సేవా నివేదికలో నిర్మల్ జిల్లా డాగ్ స్క్వాడ్ అత్యుత్తమ పనితీరుకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు దక్కాయి. నిర్మల్ జిల్లా పరిధిలో నమోదైన హత్య, అనుమానాస్పద మృతి, దొంగతనం, ఆలయ చోరీ, మాదకద్రవ్యాల కేసులతో పాటు పలు కీలక కేసుల్లో పోలీసు శునకాలు యామి, జెస్సీ, బోల్ట్ ప్రతిభ కనబరిచాయి. సంఘటన స్థలాల్లో కీలక ఆధారాలను గుర్తించడం, నిందితుల జాడలను కనిపెట్టడం, దర్యాప్తును వేగవంతం చేయడంలో విశేష పాత్ర పోషించాయని నివేదికలో పేర్కొన్నారు. కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఏఆర్పీసీ జి. పరమేశ్వర్, ఏఆర్పీసీ కె. శ్రీనివాస్, ఏఆర్పీసీ జి. సాయేందర్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, జిల్లా డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆర్ఐ శేఖర్, రామకృష్ణ , ఆర్ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్ నిర్మాణానికి రైతులు చొరవ చూపాలి

**కలెక్టర్ భవేష్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మారుమూల గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. అలాగే భూగర్భ జలాల పెంపునకు రైతులు ఫామ్ పాండ్ ల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో మంగళవారం పర్యటించిన కలెక్టర్ గ్రామంలోని తాగునీటి వసతి, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ శివాజీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల అధ్యాపకుల నూతన కార్యవర్గం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్ యూనిట్ అధ్యక్షుడు గా డా.సూర్య సాగర్, కార్యదర్శిగా కుంట శ్రీహరి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు గంగాధర్ వ్యవహరించారు. ఎన్నికైన అభ్యర్థులను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం సుధాకర్, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డా. పి జి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కె రమేష్ రెడ్డి, జి సుభాష్, జి అర్చన పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణపై విద్యార్థులకు పోటీలు..

**ముద్ర; కోరుట్ల** "వర్షపు నీటిని పట్టుకోండి, భవిష్యత్తును కాపాడండి!" అనే నినాదంతో కోరుట్ల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై డ్రాయింగ్ , వ్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర విచ్చేసి విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, డి.ఈ.ఈ అరుణ్ కుమార్, డిప్యూటీ డీ.ఈ.ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోరుట్ల ఆర్టీసీ బస్సు చోరీ

**పోలీసుల అదుపులో నిందితుడు....**

**ముద్ర; కోరుట్ల** : జగిత్యాల జిల్లా కోరుట్ల బస్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. దొంగలించిన బస్సును నిజామాబాదు వైపు తీసుకు వెళ్తుండగా గమనించిన ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కోరుట్ల, మెట్ పల్లి పోలీసులు బస్సును వెంబడించి ఇబ్రహీంపట్నం మండలం గండి హనుమాన్ దేవాలయం వద్ద ఆర్టీసీ బసును స్వాధీనం చేసుకుని, నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

## అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

**బంగారు గొలుసు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం....**

**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని బంగారు ఆభరణాలు అపహరిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణ (51), అల్లెపు రాజ్‌కుమార్ (28), కుంచెపు శ్రీకాంత్ (30)లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు 24 గ్రాముల బంగారు గొలుసు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పెన్షన్ రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచిస్తామని నమ్మించి ఓ 70 ఏళ్ల వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తీసుకుని పరారయ్యారని విచారణలో వెల్లడైంది. ప్రధాన నిందితుడు అల్లెపు కృష్ణపై గతంలో 100కు పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్–112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరుట్ల పోలీసులు సూచించారు.



# ప్రజల గుండెల్లో జర్నలిస్టులకు సుస్థిర స్థానం

**మునీర్ జీవితం ఆచరణీయం**
**ప్రధాని తీరు ప్రజాస్వామ్యానికి నష్టదాయకం**
**నాలుగు లేబర్ కోడ్స్ జర్నలిస్టులకు నష్టదాయకమైనవి**
**ప్రధాన పత్రికల వైఫల్యమే సోషల్ మీడియా విజృంభన**
**మునీర్ పుస్తక పరిచయ సభలో మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి,**



**ముద్ర, కరీంనగర్ :** ప్రజల పక్షాన నిలిచి, నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ – గోదావరిఖని సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడి దారుల చేతుల్లోకి మీడియా రంగం వెళ్లిపోయిందని అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నష్టదాయకమని పేర్కొన్నారు. జర్నలిజాన్ని నమ్ముకుని జీవితాంతం అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జర్నలిస్ట్ మునీర్ జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ వలన సమాజంలో నాలుగవ స్తంభంగా నిలబడిన జర్నలిస్టులను, దుకాణాలలో పనిచేసే కూలీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. జర్నలిస్టుల జీతభత్యాల పెరుగుదలకు మరో సమరశీల పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన పత్రికా రంగంలో వృత్తి నిబద్ధత కోల్పోవడం వలన సోషల్ మీడియాకు ఆదరణ పెరిగిందని తేల్చి చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని కథనాలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయని, వాటిపై ఏలాంటి తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగిపోతున్నదని దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**ఆదర్శప్రాయుడు మునీర్**

అక్షరాలను నమ్ముకుని జీవితాంతం పనిచేసిన మునీర్ జీవితం ఆచరణీయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ కొనియాడారు. ముఖ్యమంత్రిలతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ, ప్రజల కోసమే మునీర్ పనిచేశాడని ఆయన పేర్కొన్నాడు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య ఐజేయు టీయూడబ్ల్యూజే జాతీయ నాయకుడు నగునూరి శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మల్లా వజుల వంశీ, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు గడ్డం శ్యామ్ కుమార్ ఇఫ్తా జాతీయ నాయకులు కే స్వామి కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజిరెడ్డి రియాజ్ అహ్మద్ పర్లపల్లి రవి ఐ కృష్ణ మల్లికార్జున్ శ్రోతులు కె విశ్వనాథ్ తోకల రమేష్ రచయిత నక్క వెంకట్రావు, పుస్తక సమీక్షను హెచ్ రవీందర్ నిర్వహించారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల శ్రీనివాస్, బక్క రవి, శేఖర్, కోల లక్ష్మణ్, పాలకుర్తి విజయకుమార్, మామిడి సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, జేవి రాజు,శ్రీపతి రాజగోపాల్,మైనార్టీ నాయకులు హమీద్, మాల మహానాడు నాయకులు మర్రి ఐలయ్య, పిట్టల వెంకటి, నంది నరేష్, ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఎజ్జ రాజయ్య, దయా నర్సింగ్ జనగామ రాయనర్స్ పద్మ రమ తదితరులు పాల్గొన్నారు

## అధికారంలో ఉండగా కేటీఆర్ కు రైతులు కనిపించలేదు..






**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**ముద్ర, ధర్మారం:** అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ కు రైతులు, రైతుల సమస్యలు గుర్తుకు రాలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో మంత్రి అడ్లూరి పర్యటించారు. ఈ సందర్భంగా నంది మేడారం, రచ్చపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. అధికారం దూరమైన తర్వాత కేటీఆర్ రైతుల పరామర్శ పేరట డ్రామాలు వాడుతున్నారని లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. నంది మేడారం రిజర్వాయర్ నిర్మాణ సమయంలో నంది మేడారం గ్రామస్తులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట ఇచ్చి తప్పారని మంత్రి ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

**కుమ్మరిపల్లె మోడల్ స్కూల్‌లో మంత్రి అడ్లూరి పర్యటన**

**వెల్గటూర్:** వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై స్పందించిన తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బోర్‌వెల్ తవ్వకాలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, విద్యా బోధన, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**బుగ్గారంలో రూ.15.98 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 44 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.15,98,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజా సేవే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు



**ముద్ర, కరీంగనర్ :** జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రవాణా, పోలీస్, ఎన్ హెచ్ ఏఐ శాఖలు సమన్వయంతో రహదారి భద్రతపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. రైట్ ఆఫ్ వే పరిధిలో కొత్త వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, డ్రోన్ నిఘా, ప్రత్యేక హైవే పెట్రోలింగ్ బృందాలు, స్పీడ్ కెమెరాలు, సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సుల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి హైమాస్ట్ లైట్లు, హెచ్చరిక సంకేతాలు ఏర్పాటు చేయాలని, భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి కేంద్రాలు, ప్రమాద బాధితులకు త్వరిత వైద్యసేవల కోసం సమీప ఆసుపత్రుల మ్యాపింగ్ చేయాలని సూచించారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



**ముద్ర, కరీంనగర్:** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రారంభించి, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, ప్రత్యేక నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
**కరీంనగర్ జిల్లాలో 74.01 శాతం డిజిటలైజేషన్ పూర్తి..**
**జిల్లా పురోగతిని వివరించిన కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ముద్ర, కరీంనగర్ :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేయాలని సూచించారు. వచ్చే సమీక్ష నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జిల్లాలో ఇప్పటివరకు 74.01 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని వెల్లడించారు. ఆదివారం నాటికి 90 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని, ఓటర్లపై ఎలాంటి ఒత్తిడి చేయరాదని సీఈఓ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, తహసీల్దార్లు లక్ష్మీనరసింగరావు, రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



**ఇంటి చుట్టూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి**



చెత్తాచెదారం, పొదలు, కలుపు మొక్కలు, మురుగు నీరు దోమలకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తాయి. ఇంటి చుట్టుపక్కల ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**-యువత పై లాఠీచార్జ్ అమానుషం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**-బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో**



**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, 21 :** నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో చెలగాటమాడిన ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి ఆందోళన చేపట్టిన విద్యార్థి యువకులపై లాఠీ చార్జ్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బైపాస్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైన మోడీ సర్కార్ ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి ప్రశ్నా పత్రాల లీకేజీ ద్వారా అవినీతికి పాల్పడుతుందన్నారు. లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ ను మోడీ ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దేశంలో నియంతృత్వ ధోరణిలో పాలన సాగుతుందని శాంతియుత ప్రజా పోరాటాలపైన లాఠీలు ఝుళిపించడమే ఇందుకు నిదర్శనమని సురేష్ తెలిపారు. ఆందోళనపై పోలీస్ లాఠీచార్జి కి సంబంధించి సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నియంతృత్వ ధోరణితో అవలంభించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గతం మాదిరే మోడీ ప్రభుత్వానికి కూడా అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయని సురేష్ తెలిపారు. ప్రజా పోరాటాలకు ప్రజలు –సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాస్తారోకో సందర్భంగా బైపాస్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, నాయకులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, పగడాల మల్లేష్, దండు ఆదినారాయణ, మిడికంటి వెంకట రెడ్డి, సిహెచ్ సీతామహాలక్ష్మి, యంగల ఆనందరావు, కూచిపూడి రవి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతర పోరాటాలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 21 :** కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, సామాన్యుల కంటే కార్పొరేట్ శక్తుల పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. మోడీ సర్కార్ ప్రజల గురించి ఆలోచించడం లేదని పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని స్థితికి ప్రభుత్వ చర్యలు నెట్టివేస్తున్నాయన్నారు. సిపిఐ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం గిరిప్రసాద్ భవన్ లో బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగింది, సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ఆగస్టు –ఆరు నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక IChemE ఫెలోగా తెలంగాణ శాస్త్రవేత్త డాక్టర్ రుద్రంగి



**ముద్ర, సూర్యపేట :** సూర్యాపేటకు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ శాస్త్రవేత్త డాక్టర్ శశి రవి సుమన్ రుద్రంగి ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ (IChemE) ఫెలో (FIChemE)గా ఎన్నికయ్యారు. రసాయన ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్ తయారీ రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ప్రస్తుతం ఆయన ఐర్లాండ్‌లోని ఒలేమా ఆంకాలజీ సంస్థలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (FRSC) ఫెలోగా గుర్తింపు పొందిన డాక్టర్ రుద్రంగి, ఈ ఫెలోషిప్ తన వృత్తి జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు.

## సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సమావేశం.



**ముద్ర, సూర్యాపేట:** సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులతో పట్టణ ఇన్స్పెక్టర్ ఈరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, వృద్ధుల భద్రత, మరియు స్థానిక సమస్యలపై కమిటీ సభ్యులతో ఇన్స్పెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణాన్ని పెంపొందించడంలో సీనియర్ సిటిజన్ల అనుభవం, సలహాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. పట్టణంలో వృద్ధులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం వాలంటీర్లుగా ముందుకొచ్చిన సీనియర్ సిటిజన్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వాలంటీర్ కమిటీ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులు పోరాటానికి మద్దతుగా మానవహారం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 21 :** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఆందోళనకు సంఘీభావంగా పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉమెన్స్ కాలేజీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం ఢిల్లీలో చేస్తున్న ఉద్యమాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల నిర్బంధ చర్యలను వెంటనే నిలిపివేయాలని, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యశ్వంత్, స్టాలిన్ ,మనోజ్, మహేష్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు

## రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లు, పోలీసు, రవాణా, రహదారులు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలను ప్రతి నెల నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన రహదారి భద్రతా ఆదేశాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ కలెక్టర్ కృతిక, జిల్లా రవాణా శాఖ అధికారి నరేష్,ఆర్ అండ్ బి అధికారి సరిత పాల్గొన్నారు.

## నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భువనగిరి నుండి టేకులసోమారం వయా నమాత్‌పల్లి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నమాత్‌పల్లి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెలపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోత్తంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, చందుపట్ల సింగిల్ విండో చైర్మన్ జీలుగు సతీష్ పవన్, భువనగిరి సింగిల్ విండో చైర్మన్ ఫకీరు కొండల్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఆర్టీసీ డిఎం సురేష్, గ్రామ సర్పంచ్ అతికం అరుణ లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, నరాల వెంకటస్వామి యాదవ్, పాశం శివానంద్, రాంపల్లి కృష్ణ, చుక్క స్వామి, పాలకవర్గం పాల్గొన్నారు.

## బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ భూముల కేటాయింపులపై విచారణ కోరిన బీజేపీ



**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, 21:** సత్తుపల్లి మండలం బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ భూముల కేటాయింపుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ 'ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన' కింద అభివృద్ధి చేసిన మెగా ఫుడ్ పార్క్ భూములను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దీపక్ నెక్స్ జెన్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధరకు కేటాయించారని ఆరోపించారు. గతంలో ఎకరాకు రూ.51 లక్షలుగా ఉన్న ధరను రూ.25 లక్షలకు తగ్గించి 72 ఎకరాలను కేటాయించడం వెనుక కారణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఫుడ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఎకరా భూమి మార్కెట్ విలువ రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉండగా, అదే సంస్థ సమీపంలోని ప్రైవేట్ భూమిని ఎకరాకు రూ.75 లక్షలకు కొనుగోలు చేసిందని పేర్కొంటూ, ప్రభుత్వ భూముల కేటాయింపులో ప్రజాధనానికి నష్టం జరిగిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, నరుకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**కొండమల్లేపల్లి, జులై 21 (ముద్రన్యూస్):** దేవరకొండ నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు పార్టీ కార్యకర్తలందరి బాధ్యత అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియలో ఒక్క అర్హులైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి గ్రామం ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని అర్హులైన ప్రతి వ్యక్తి ఓటు జాబితాలో పేరు లేకపోతే ఎన్నికల్లో ఓటు వేయలేకపోవడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల విషయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బీఎల్ఏ, కార్యకర్త తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన చోట కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు జరిగేలా ప్రజలకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ముఖ్యంగా యువత, మహిళలు, వృద్ధులు, గిరిజనులు, దూర ప్రాంత ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం ప్రతి ఓటును కాపాడుకోవడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో ఒక్క అర్హులైన ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలి అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు.

# రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం..

**- ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు**
**- ఎంపీ వద్దిరాజు చొరవకు దక్కిన ఫలితం**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం 21:** చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. దానికి తోడు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ.. ఆర్ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని భువనగిరి డిఎస్పి బండారు రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణ శివారులోని రాయగిరి యూనిటీ ఫార్మసీ కళాశాలలో సైబర్ క్రైమ్ ఫై భువనగిరి రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన సిఐ చంద్రబాబు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఆ చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా బాధ్యతతో ఉంటూ, సైబర్ క్రైమ్ బడిన పడకూడదన్నారు. అందరు ఉద్యోగాల పేరుతో కొంతమంది ఉచిత ఆఫర్ల పేరుతో లింక్స్ పంపిస్తారని వాటిని ఓపెన్ చేయవద్దన్నారు. వెంటనే 100కు కాల్ చేయాలని, పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ మిర్యాల అనిల్ కుమార్, యూనిటీ కళాశాల అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 22.07.2026
www.mudranews.in | @mudranews



### జ్వరం, ఒళ్లునొప్పులు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తాయి. జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, ఒళ్లునొప్పులు లేదా దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు.



## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలి

**- డీఎంహెచ్ఓ డా. సి.హెచ్. ధనరాజు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట, జూలై 21:**

కుకునూరుపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. సి.హెచ్. ధనరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, జ్వరం వంటి లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి వెంటనే పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

గర్భిణులను నమోదు చేసినప్పటి నుంచి సురక్షిత ప్రసవం జరిగే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఇంటింటి సందర్శనల సందర్భంగా కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అవసరమైన వైద్య సూచనలు అందించాలని తెలిపారు. అలాగే పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్కచిన్నారి కూడా టీకాలకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే "డ్రై డే" కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేసి దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించాలని అధికారులకు సూచించారు.

అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, ఔషధ నిల్వలు, వైద్య సేవల అమలు తీరును పరిశీలించిన డీఎంహెచ్ఓ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. కిరణ్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్ లలిత, హెచ్ఎస్ సుజాత, ల్యాబ్ టెక్నీషియన్ బాలమణి, ఫార్మసీ ఆఫీసర్ సోమిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకంలో మెదక్ జిల్లా ఖ్యాతి జాతీయస్థాయికి ఎదగాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పర్యాటకంలో మెదక్ జిల్లా ఖ్యాతి జాతీయస్థాయికి ఎదగాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పోచారం అభయారణ్యంలో క్యాంప్ ఫైర్ లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఎఫ్ఓ జోజి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, హవేలీఘన్పూర్ తహసిల్దార్ సింధు రేణుక, డిపిఆర్ఓ రామచంద్ర రాజు సందర్శించారు. మెదక్ జిల్లాలో గల పర్యాటక, చారిత్రాత్మక వారసత్వ, ఆధ్యాత్మిక, అభయారణ్యాలతో పర్యాటక సర్క్యూట్ రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్ ల బృందం గత ఐదు రోజులుగా కొనసాగిన పలు పర్యాటక ప్రదేశాల సందర్శన ముగిసింది. అందరి సహకారంతో పర్యాటక స్ఫూర్తితో ముందుకు పోతామన్నారు. పోచారం అభయారణ్యంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు. జిల్లాలో ఉన్న చారిత్రాత్మక ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలతో పాటుగా మెదక్ కు తలమానికమైన పోచారం అభయారణ్యం ప్రాంతాలను అభివృద్ధిపరిచి పర్యాటక రంగంలో మెదక్ జిల్లాకు విశేష గుర్తింపు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీసుకురావడానికి ప్రయత్నంలో భాగంగా గత ఐదు రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాలను జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సీనియర్



కన్సల్టెంట్స్ శవంతి గుప్తా, భువన్ ల బృందం సందర్శించారు. పోచారం అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి అడవుల పరిశుభ్రతను కాపాడాలని అధికారులు సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

**- ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, నేరస్తుల



కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు, వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు రంగాకృష్ణ, సందీప్ రెడ్డి, ఎస్ఐలు రంజిత్ రెడ్డి, జగన్మోహన్, కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### యువకుడికి ఏడాది జైలు...

చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను షేర్ చేయడం, సర్క్యులేట్ చేయడం వంటి నేరాలకు పాల్పడిన తూప్రాన్‌కు చెందిన అరిగే శివకుమార్ (20) కు పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. తూప్రాన్ పట్టణానికి చెందిన శివకుమార్ డిగ్రీ చదువుతున్నాడు. చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను షేర్ చేస్తున్నాడనే అనుమానంతో పోలీసులు అతడి ఫోన్‌ను పరిశీలించగా, ఒక వ్యక్తి పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను సృష్టించి ఇతరులకు అశ్లీల కంటెంట్‌ను పంపుతున్నట్లు గుర్తించారు. సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో ఐపీ అడ్రస్, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని గుర్తించారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం 12 మే 2026న కేసు నమోదు చేయగా, అప్పటి ఐఓ, తూప్రాన్ సీఐ రంగకృష్ణ దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శుభవలి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు సహకరించారు.



## కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందడం బాధాకరం

**- ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రైతు గాంతి శ్రీనివాస్ గొర్రెలు, మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో 44కు పైగా గొర్రెలు, మేకలు మృతి చెందాయి. మరో 25 గొర్రెలు, మేకల పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత పెద్ద మొత్తంలో పశువులను కోల్పోవడం రైతుకు తీరని ఆర్థిక నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతుకు ప్రభుత్వం తరఫున తగిన నష్టపరిహారం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యుడు మధు, కాంగ్రెస్ గ్రామ శాఖ నాయకులు లక్ష్మీనారాయణ, అజ్మత్,జనార్ధన్ రెడ్డి. నవీన్ రెడ్డి, ఇసాక్, వెంకట్ రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బీఆర్ఎస్

**- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదు కానీ ఇప్పుడు రైతుల పట్ల ఎమ్మెల్యే హరీశ్ రావు బిఆరెస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. మంగళవారం అయన మాట్లాడుతూ 20 వేల కోట్ల రూపాయలతో పూర్తి అయ్యే ప్రాజెక్టును లక్ష కోట్ల రూపాయల అంచనాకు పెంచి కెసిఆర్ కుటుంబం కేటీఆర్ హరీశ్ రావు కవిత ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. ప్రజలకు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టు కట్టిస్తున్నాం అని చెప్పి కూలిపోయే ప్రాజెక్టు కట్టిన ఘనత కెసిఆర్ కుటుంబానికి దక్కిందన్నారు. బిఆరెస్ పార్టీ నాయకులు వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి రావడం కోసం ప్రజలను రైతులను రెచ్చగొడుతున్నదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆరెస్ పార్టీ కనుమరుగు అవడం ఖాయమన్నారు.ప్రజలు బిఆరెస్ పార్టీని ఎక్కడ మరిచిపోతారో అని తమ ఉనికి కాపాడుకునేందుకు నీచమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. రైతులను మోసం చేయాలని నీరు విడుదల చేయాలని రైతులను అడ్డం పెట్టుకుని రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరింత నష్టం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారన్నారు. రైతులకు నీరు ఎప్పుడు అందించాలో ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుసు అని అన్నారు. అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయడం లేదని బిఆరెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రాజెక్టు రిపేర్ కోసం 10 సంవత్సరాలలో మీరు దోచుకున్న సొమ్మును ప్రభుత్వానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర మీదని. అధికారంలో ఉన్నప్పుడు రైతులను నట్టేట ముంచి పాదయాత్ర చేయడం సిగ్గుచేటన్నారు. అధికారం పోగానే బిఆరెస్ నాయకులకు రైతులు గుర్తువచ్చారా అని ప్రశ్నించారు. మీరు చేసే దొంగ డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు అని తెలుసుకోవాలి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ది రైతు సంక్షేమ ప్రభుత్వం అని తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం అభివృద్ధిని చూసి బిఆరెస్ పార్టీ నాయకులు ఓర్వడం లేదు అని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడు అని ఆయన నాయకత్వంలో అన్ని వర్గాల వారి సంక్షే మం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బిఆరెస్ ది అయితే రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం అవు తుంది అని, మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి అని అన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే బిఆరెస్ పార్టీ నాయకుల తాట తీస్తాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిముద్దీన్, మార్కా సతీష్, దాస అంజయ్య, వహాబ్, గయాసుద్దీన్ ,బంక చిరంజీవి, విజయ డైనల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై యూఎస్ఎఫ్ఐ నిరసన

**- కేంద్ర బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద కేంద్ర బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ, నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. ఇంతటి తీవ్రమైన ఘటన జరిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా కాలయాపన




చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా విద్యార్థులు, యువజనులు శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువజనులపై ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తుంటే వారిపై బలప్రయోగం చేయడం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యా వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం బలిపశువుగా మార్చకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు, విద్యార్థుల డిమాండ్లు నెరవేరే వరకు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హేమంత్, రాకేష్, అభినయ్, మనోజ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులో ఖరీఫ్ ధాన్యం మాయం.. కేసు నమోదు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మండల కేంద్రం కుల్చారంలో గల శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ లో విజిలెన్సు అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్ (2025 –26) సీజన్ కి సంబదించిన 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం (75,749 బస్తాలు) తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ధాన్యం విలువ 7,17,79,752.40 ఉంటుందని, రైస్ మిల్ యజమాని డి. శ్రీనివాస్ పైకేసు నమోదు చేసి కలెక్టర్ కు నివేదించారు. ఈ తనిఖీలో జిల్లా పౌర సరఫరల అధికారి నిత్యానంద్ తదితరులు ఉన్నారు.



## బీసీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఆగస్టు 7న బెంగళూరులో జరిగే బీసీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిన రమ కోరారు. ప్రచార సన్నాహక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా ఏడుపాయలలో జిల్లా సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు, విద్యార్థులకు రిజర్వేషన్ పెంపుదల కోసం ముమ్మర ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగుల సంక్షేమం, బీసీ ఉద్యోగుల ప్రమోషన్ రిజర్వేషన్ అమలు కోసం దశల వారి ఉద్యమాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కే. శేషాచారి, రాష్ట్ర బాధ్యులు, మహేంద్ర సాగర్ కే.మహేందర్, డి. ప్రసన్న కుమార్ ఈ.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No.6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu. Rockdale compound, Somajiguda, Hyderabad-500082 Editor Y Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email mudradailys@gmail.com